'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

కారు విజయం తథ్యం

- ఐదు నెలల్లోనే కాంగ్రెస్‌పై ప్రజావ్యతిరేకత ప్రారంభమైంది..
- పదేళ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రజలకు చేసిందేమీ లేదు..
- ప్రచారానికి మంచి స్పందన లభించింది..
- 'నమస్తే ఇంటర్వ్యూ'లో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఆదిలాబాద్, మే 11(నమస్తే తెలంగాణ) : 'పార్లమెంట్ ఎన్నికల్లో కారు విజయం తథ్యం. ప్రజలు కచ్చితంగా బీఆర్ఎస్‌కే పట్టం కడుతారు. రాష్ట్రంలో ఐదు నెలల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకుంది. కేంద్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం ప్రజలకు, ఆదిలాబాద్ జిల్లావాసులకు చేసిందేమీ లేదు. బోథ్ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి ఇంటింటా ప్రచారం నిర్వహించాం. ప్రజలు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు.' అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలిపారు. ఆయన 'నమస్తే తెలంగాణ'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

'నమస్తే' : ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఏ పార్టీకి విజయావకాశాలున్నాయి?

అనిల్ జాదవ్ : పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ విజయం సాధిస్తుంది. రాష్ట్ర, జిల్లా సమస్యలను గులాబీ పార్టీ ఎంపీలు మాత్రమే కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లగలరు. పార్లమెంట్‌లో తెలంగాణ గొంతు వినిపించే సత్తా కేవలం బీఆర్ఎస్ ఎంపీలకు మాత్రమే ఉంది. బీఆర్ఎస్‌కు రాష్ట్ర ప్రజలే అధిష్టానం. బీజేపీ, కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఢిల్లీలో ఉంటుంది. వారు సూచించిన విధంగా రెండు పార్టీల ఎంపీలు తోక ఆడించాలి. తెలంగాణ సమస్యల విషయంలో రెండు పార్టీల ఎంపీలకు పార్లమెంట్‌లో రాష్ట్ర సమస్యలపై మాట్లాడే అవకాశాన్ని వారు నాయకులు కల్పించరు. ప్రజలు ఈ విషయాన్ని గ్రహించారు. బీఆర్ఎస్ ఎంపీల ఆవశ్యకతను తెలుసుకున్నారు.

'నమస్తే' : బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులను ప్రజలు ఎందుకు నమ్మడం లేదు?

అనిల్ జాదవ్ : కేంద్రంలో పదేండ్లు అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణ అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించింది. విభజన చట్టంలో హామీలను నెరవేర్చలేదు. రాష్ట్రానికి రావాల్సిన నిధులను ఇవ్వక కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుంది. కాంగ్రెస్ ఐదు నెలల పాలన అస్తవ్యస్తంగా మారింది. తాగు, సాగునీరు, విద్యుత్ కోతలు, పంటల కొనుగోళ్లు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రకటించిన ఆరు గ్యారెంటీలు ఆటకెక్కాయి. ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఏ పథకం అమలు కావడం లేదు.

'నమస్తే' : పెండింగ్ ప్రాజెక్టులను మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఈ ఎన్నికల్లో వీటి ప్రభావం ఉంటుందా?

అనిల్ జాదవ్ : ఆర్మూర్ – ఆదిలాబాద్ రైల్వేలైన్, ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమ పునఃప్రారంభం, విమానాశ్రయం ఏర్పాటు, నవోదయ పాఠశాల మంజూరు ఇతర సమస్యలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఈ ప్రాజెక్టుల విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తామని మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లు ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులను కలిసినా కనీస స్పందన లేదు. ఇటీవల ఆదిలాబాద్‌లో ప్రధాని మోదీ పర్యటనపై జిల్లావాసులు ఆశలు పెట్టుకున్నారు. బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు జిల్లా పెండింగ్ సమస్యలను పరిష్కారించాలని కోరినా ఆయన స్పందించలేదు. ఈ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి తగిన బుద్ధి చెబుతారు.

'నమస్తే' : ఎన్నికల ప్రచారం ఎలా సాగింది?

అనిల్ జాదవ్ : బోథ్ నియోజకవర్గంలోపాటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఇతర నాయకులతో ప్రచారంలో పాల్గొన్నా. పార్లమెంట్ పరిధిలో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మా నియోజకవర్గంలో నాతోపాటు ఇతర ప్రజాప్రతినిధులు, గ్రామ, మండల కమిటీలు ఇంటింటా ప్రచారం నిర్వహించాయి. బీఆర్ఎస్ ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేసిన రైతుబంధు, కల్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్, మిషన్ భగీరథ నీరు నిలిచిపోయాయని ప్రజలు అంటున్నారు. ఐదు నెలల్లో కాంగ్రెస్ పార్టీపై తీవ్ర వ్యతరేకత కనిపిస్తుంది. ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నాయకుల తీరుపై వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అండగా ఉండామని హామీ ఇస్తున్నారు.

చెన్నూర్ ప్రజా ఆశీర్వాద సభకు వచ్చిన ప్రజలకు అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో బాల్కసుమన్

ఈశ్వరుడికి.. కోటేశ్వరుడికి పోటీ

భూగర్భ కార్మికుడు కావాలా.. ఆగర్భ శ్రీమంతుడు కావాలా..

పెద్దపల్లి ఎంపీగా ఈశ్వర్ అన్న గెలిస్తే మంచిగ పనిచేస్తరు

- ముసలోళ్ల పింఛన్ ఎగ్గొట్టి.. వాళ్ల కడుపుకొట్టినోడు రేవంత్
- మిమ్ముల మోసం చేసినోళ్లకు ఓటుతో బుద్ధి చెప్పండి
- లక్ష ఎకరాలకు నీళ్లిచ్చే లిఫ్ట్ ఇరిగేషన్ ఆపడం కాదు.. దమ్ముంటే రెండు లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే పథకం తెండి
- చేతి గుర్తోడు గెలిచినా.. పువ్వు గుర్తోడు గెలిచినా సింగరేణిని అమ్మడం ఖాయం
- మంచి పనులు చేసి జనాల మనసు గెలవాలే
- చెన్నూర్ ప్రజా ఆశీర్వాద సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

చెన్నూర్ ప్రజా ఆశీర్వాద సభకు తరలివచ్చిన బీఆర్ఎస్‌కు జై కొడుతున్న ప్రజలు, నాయకులు, కార్యకర్తలు

మంచిర్యాల, మే 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'పెద్దపల్లి పార్లమెంట్‌లో పోటీ ఎవరెవరి మధ్య జరుగుతుందంటే.. మొన్ననే పెద్దలు కేసీఆర్ మంచిర్యాలకు వచ్చినప్పుడు చెప్పారు. ఒక భూగర్భగని కార్మికుడికి.. ఆగర్భ శ్రీమంతుడికి మధ్య పోటీ నడుస్తున్నది. ఈశ్వరునికి.. కోటీశ్వరునికి మధ్య పోటీ జరుగుతున్నది. ఒక గుణవంతుడికి.. ఒక ధనవంతుడికి మధ్య పోటీ జరుగుతున్నది. మరి గెలిచే దెవ్వరు.. గెలవాల్సింది ఎవ్వరో మీరే ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. దయచేసి ఆగం కావొద్దు. ఇదే చెన్నూర్ పట్టణానికి సరిగ్గా ఐదు నెలల కింద నవంబర్ 24న తమ్ముడు బాల్క సుమన్‌ను గెలిపించండి అని అడగడానికి వచ్చాను. కానీ ఏమైందో.. ఏమో నాలుగైదు రోజుల్లోనే పరిస్థితి తారుమారైంది. కాంగ్రెసోళ్లు చూపెట్టిన అరచేతిలో వైకుంఠం.. అనే సినిమా చూసి చెన్నూర్ ప్రజలు మోసపోయారు.' అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ విజయాన్ని కాంక్షిస్తూ శనివారం చెన్నూర్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

ఈ ఐదు నెలల్లో.. ఏమన్నా జరిగిందా...

ఏమన్నరు కాంగ్రెసోళ్లు.. ఫ్రీ బస్సు అన్నరు.. తులం బంగారం ఇస్తా.. ఆడపిల్లలకు స్కూటీలు.. కోడళ్లకు రూ.2500, అత్తలుంటే(ముసలవ్వలకు) రూ.4000, అత్తలకు భర్తలుంటే(ముసలయ్యలకు) రూ.4000 పింఛన్ ఇస్తా అన్నరు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ అన్నరు. క్వింటాలు వరికి రూ.500 బోనస్ ఇస్తా అన్నరు. ఈ ఐదు నెలల్లో వీటిలో ఏదైనా అమలయ్యిందా మీరే చెప్పాలంటూ జనాలను కేటీఆర్ ప్రశ్నించారు. ఫ్రీ బస్సులో ఏమన్నా సుఖం ఉన్నదా.. ఫ్రీ బస్సు తుస్సు మందన్నారు. రేవంత్ రెడ్డి రూ. రెండు లక్షల రుణ మాఫీ అన్నడు. డిసెంబర్ 9 నాడు ఎంబడే చేస్తా. ఉరుకుండ్రి బ్యాంక్ నుంచి తెచ్చుకోండి.. నేను సంతకం పెట్టనే పెడితిని.. మీ ఖాతాలో పడనే పడే.. అన్నడు. మరి పడ్డయా పైసలు.. పడ్డయా రెండు లక్షలు.. రైతన్నలు, రైతు బిడ్డలు ఆలోచించాలన్నారు. మరి చెన్నూర్‌లో ఉన్న కోటీశ్వరుడన్న ఇయ్యలేదా రెండు లక్షలు. ఆయన జేబు దులిపితే పడుతయ్ రెండు లక్షలు.. కానీ ఏస్త లేరన్నారు. అయినా మళ్లా వాళ్లకే ఓటు వేద్దామా.. మళ్లా మొండి చేయికే గుద్దుదామా.. మనకు మొండిచేయి ఇచ్చినంక కూడా తెలివి తెచ్చుకోవద్దా.. ఆలోచించాలన్నారు.

ముసలోళ్లకు రూ. నాలుగువేల పింఛన్ ఇస్తా అన్నరు. కేసీఆర్ ఒక్కరికే ఇస్తండు.. నేను ఇద్దరికీ.. ముసలమ్మ–ముసలయ్యకు ఇస్తా.. కేసీఆర్ రెండు ఇస్తే నేను నాలుగు ఇస్తా అన్నడు.. మరి పడ్డయా పింఛన్లు అంటే.. కొత్త పింఛన్లు ఇచ్చుడు కాదు జనవరి నెల ముసలోళ్ల పింఛన్లు ఎగ్గొట్టి.. వాళ్ల కడుపుకొట్టినోడు రేవంత్‌రెడ్డి అంటూ ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ వచ్చినంక తెలంగాణలో లక్షన్నర పెళ్లిళ్లు అయ్యాయని, ఈ లెక్కన రేవంత్‌రెడ్డి లక్షన్నర తులాల బంగారం మా ఆడబిడ్డలందరికీ బాకీ ఉన్నాడు. నిన్ను నమ్మి ఓట్లు వేసిండ్రు.. మీరు చెప్పిన అడ్డగోలు హామీలు నమ్మి ఓట్లు వేసినోళ్లందరికీ న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పదిపన్నెండు సీట్లు ఇవ్వండి..

ఇక్కడికి వచ్చినోళ్లందరూ నిజాయితీగా సమాధానం చెప్పండి. ఐదు నెలల కిందట కేసీఆర్ ప్రభుత్వం ఉండే.. అప్పుడే బాగుండే అనుకున్నోళ్లందరూ చేతులు ఎత్తాలంటూ కేటీఆర్ అడగ్గానే.. వచ్చిన జనం మొత్తం చేతులు ఎత్తారు. బరాబరా ఈ ముచ్చట.. పక్కానా.. ఏం అనుమానం లేదా.. అని ప్రశ్నించగా.. పక్కాగా చెప్తున్నామన్నారు. అయితే మీరంతా చేయాల్సింది ఒక్కటే పని.. 13న జరిగే ఎన్నికల్లో రెండో నంబర్ మీద ఓటేయాలని పిలుపునిచ్చారు. మొత్తం తెలంగాణలో పది పన్నెండు సీట్లు ఇయ్యండి. ఆరు నెలల్లో తిరిగి కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలను శాసించే పరిస్థితి వస్తుందన్నారు. ప్రజాస్వామ్యంలో బుల్లెట్ కంటే బ్యాలెట్‌కే ఎక్కువ పవర్ ఉంటుందన్నారు. ఇవాళ పోలీసోళ్ల దగ్గర బులెట్లు ఉండొచ్చు. కానీ, మీ దగ్గర బులెట్ కంటే పదునైన ఆయుధం బ్యాలెట్ ఉందన్నారు. పెద్దపెద్ద కోటీశ్వరులను కూడా కొట్టేందుకు ఒక్కటే ఆయుధం ఓటు అని.. ఆ ఓటుతోని వేటు వేయాలంటూ పిలుపునిచ్చారు. ఎవ్వరైతే మిమ్ములను మోసం చేసిండ్రో.. ఎవ్వలైతే అడ్డగోలు కార్యక్రమాలు చేస్తున్నరో వాళ్లకు బుద్ధి చెప్పాలని కేటీఆర్ సూచించారు.

మా తమ్ముడు దమ్ము.. రేషం ఉన్నోడు

మా తమ్ముడు సుమన్ రేషం ఉన్నోడు. దమ్ము ఉన్నోడు. నేను ఉత్తగనే అనలే ఈ మాట. రేవంత్‌రెడ్డి అనేటోడు చిల్లర గాడు. ముఖ్యమంత్రే కావచ్చు కానీ చిల్లర గాడు. ఆ చిల్లరగాడు కేసీఆర్‌నుద్దేశించి ఒక చిల్లర మాట మాట్లాడిండు. నేను కేసీఆర్ కొడుకునే కావచ్చు. కానీ నా తమ్ముడు ఎంత రేషం ఉన్నోడంటే చెప్పు తీసి ముఖ్యమంత్రికి చూపెట్టిండు. చెప్పుతో కొడుతా చెత్తనా కొడుకా అని చెప్పిండు. అదీ దమ్మున్న నాయకుడు అంటే. పదవి ఉంటది కావచ్చు. పీకుతది కావచ్చు. బతికేదే కొన్ని రోజులు. అందరం చస్తాం. కానీ బతికినన్ని రోజు రేషంతోని బతకాలి అని చూపెట్టిన పులి బిడ్డ మా తమ్ముడు సుమన్‌కు హృదయ పూర్వకంగా ధన్యవాదాలు. ఇంత మంచి నాయకుడిని కోల్పోయారు. మరి ఇప్పుడు ఈశ్వర్ అన్నను గెలిపిస్తే రేపు చెన్నూర్ ఎమ్మెల్యే లెక్క చేస్తడు. - కేటీఆర్

ప్రజల మనసు గెలవాలంటే.. దమ్ముతో పనులు చేయాలే..

ఇందకా నేను ఇక్కడికి వస్తుంటే సుమన్ చెప్తున్నడు.. అన్న నా మీద కోపంతో నేను మంజూరు చేయించిన లక్ష ఎకరాలకు నీళ్లిచ్చే చెన్నూర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును క్యాన్సల్ చేయించిండు అని బాల్క సుమన్ చెప్పాడని కేటీఆర్ అన్నారు. దీనికి నేను ఏమంటున్న అంటే.. నువ్వు(వివేక్) గెలిచినవ్ సరే.. గెలిచినంక ప్రజల మనసు గెలవాలి కదా.. గెలవాలంటే ఏం చేయాలే.. తమ్ముడు లక్ష ఎకరాలకు నీళ్లిచ్చే ప్రాజెక్ట్ తీసుకువస్తే నీకు చేతనైతే, నీకు దమ్ముంటే దాన్ని పెంచు. రెండు లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే ప్రయత్నం చేయాలన్నారు. రెండు పంటలకు నీళ్లిచ్చే ప్రాజెక్ట్ ఉంటే.. మూడు పంటలకు నీళ్లిచ్చేలా చేయమని సూచించారు. చెన్నూర్, మందమర్రి మున్సిపాలిటీలకు నేను మున్సిపల్ మంత్రిగా పైసలు ఇచ్చినా.. నీకు దమ్ముంటే నేను రూ.50 కోట్లు ఇస్తే.. నువ్వు రూ.150 కోట్లు తీసుకురా.. ప్రజల మనసు గెలుచుకుంటే గట్ల గెలుచుకోవాలే.. రాజకీయం అంటే అదే కోరుకుంటరు ప్రజలు. రూపాయి ఎక్కువ పని చేయాలే.. ఎక్కువ అందుబాటులో ఉండాలే.. కష్టంలో సుఖంలో తోడు ఉండాలే అనుకుంటున్నరు. కానీ ఇవాళ గెలిచిన నాయకులకు ఆ సోయి లేదంటూ మండిపడ్డారు.

బీజేపీకి ఎందుకు ఓటు వేయాలే..

ఎందుకు వేయాలే బీజేపీ వాళ్లకు ఓటు అంటే గుడి కట్టినం అని చెప్తున్నారు.. మరి కేసీఆర్ కట్టలేదా గుడి.. యాదాద్రిలో బ్రహ్మాండమైన గుడి కట్టలేదా చెప్పాలని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ ఒక్క యాదగరి గుట్టనే కాదు బ్రహ్మాండంగా నీళ్లు తీసుకువచ్చేందుకు చెన్నూర్ లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేసిండు. కాళేశ్వరంలాంటి ప్రాజెక్టు, పాలమూరు రంగారెడ్డిలాంటి ప్రాజెక్టు కట్టిండు.. ఎర్రటి ఎండల్లో చెరువులను మత్తడి దునికిచ్చిండు. గసొంటి కేసీఆర్‌ను పోగొట్టుకొని.. పదేళ్లలో బుడ్డ పైసా పని చేయని మోదీకి ఎందుకు ఓటు వేయాలో ఆలోచించాలన్నారు. అన్ని పిరం చేసినోడే మోదీ అని.. పప్పు, ఉప్పు, నూనె, సామాన్యుడు తినే కూరగాయలన్నీ పిరమైనయంటే దానికి కారణం ఒకే ఒక్కడు నరేంద్ర మోదీ అన్నారు. కాంగ్రెస్ చేతి గుర్తోడు గెలిచినా.. బీజేపీ పువ్వు గుర్తోడు గెలిచినా.. సింగరేణిని అదానీకి అమ్మేయడం ఖాయమన్నారు. సింగరేణి ప్రవేట్ పరం కావద్దు అంటే పెద్దపల్లిలో కొప్పుల ఈశ్వర్ గెలవాలన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండే అనుకునే వాళ్లంతా కొప్పుల ఈశ్వర్‌కు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. సభలో పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాన్ని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

'నమస్తే' కథనానికి స్పందన

ధాన్యాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ కిశోర్ కుమార్

ఖానాపూర్ టౌన్, మే 11 : 'తడిసిన ధాన్యం కొనాలె..' శీర్షికన శనివారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మార్కెట్ యార్డ్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. రెండు రోజులుగా అకస్మాత్తుగా కురుస్తున్న వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కోతలు లేకుండా కొనుగోలు చేయాలని రైతులు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. దీంతో కొనుగోలు కేంద్రం పరిశీలనకు వచ్చిన అడిషనల్ కలెక్టర్‌కు రైతులు తమ గోడును వెల్లబోసుకున్నారు. తమకు కొనుగోలు కేంద్రంలో సౌకర్యాలు కల్పించడం లేదని, కనీసం టార్పాలిన్ కవర్లు అందించడం లేదని తెలిపారు. తూకం అయిన ధాన్యం తరలించకపోవడంతో తడిసి పోయిందని రైతులు ఆవేదనను వ్యక్తం చేశారు. రైతులకు తక్షణమే టార్పాలిన్ కవర్లు అందజేయాలని సీఈవో ఆశన్నను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడిషనల్ కలెక్టర్ ఆదేశాలతో వెంటనే రైతులకు టార్పాలిన్ కవర్లను అందజేశారు. ఆయన వెంట ఆర్ఐరాజేశ్వర్, మార్కెట్ కమిటీ సెక్రెటరీ సయ్యద్ అజమ్ అలీ ఉన్నారు.

జాగ్రత్తలు పాటించాలి..

మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

బోథ్, మే 11 : ఎన్నికల సామగ్రి, సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమంలో జాగ్రత్తలు పాటించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. శనివారం బోథ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రంలో సెక్టార్ అధికారులు, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని తొమ్మిది మండలాలను 35 రూట్లుగా విభజించడం జరిగిందన్నారు. వీటి పరిధిలో 306 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి.. పీవో, ఏపీవో, క్లరికల్ సిబ్బంది సుమారుగా 1,560 మందిని విధుల కోసం నియమించామని తెలిపారు. మొత్తం 2,11,300 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు.

కుంటాల : అందకూర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకురాలు రమాదేవి

దస్తురాబాద్ : అక్కొండపేట్‌లో ప్రచారం చేస్తున్న పెంబి జడ్పీటీసీ భూక్యా జానుబాయి

తాంసి (తలమడుగు) : కప్పర్లలో ఆటోలో ప్రయాణిస్తున్న మహిళను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ప్రచారం సమాప్తం

హోరాహోరీగా సాగిన పార్లమెంట్ ఎన్నికల క్యాంపెయిన్

- ప్రచారంలో పాల్గొన్న ప్రధాన పార్టీల అగ్రనేతలు
- ఆదిలాబాద్ పార్లమెంట్ బూత్ కమిటీ సమావేశంలో పాల్గొన్న కేటీఆర్
- ఇంటింటా తిరుగుతూ కేసీఆర్ పథకాలను వివరించిన నాయకులు
- సక్కు తరపున మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రచారం
- ప్రజల నుంచి విశేష స్పందన

ఆదిలాబాద్, మే 11(నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసిం ది. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో బీఆర్ఎస్ నాయకులు ప్రచారాన్ని హోరెత్తించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జోగు రామన్న, ఆసిఫాబాద్, బోథ్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్ జాదవ్, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పార్టీ అభ్యర్థి ఆత్రం సక్కు తరపున గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. యువనేత కేటీఆర్ ఆదిలాబాద్‌లో పార్లమెంట్ బూత్ కమిటీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని విజయమే లక్ష్యంగా దిశానిర్దేశం చేశారు. భైంసా, నిర్మల్ రోడ్ షోలకు కేటీఆర్ హాజరయ్యారు. చివరిరోజు శనివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నియోజకవర్గంలో నేరడిగొండ, తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటించి విస్తృతంగా ప్రచారం చేపట్టారు. జైనథ్ మండలంలో మాజీ మంత్రి జోగు రామన్న పర్యటించి బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కుకు ఓటు వేయాలని కోరారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కూడా బడా నాయకులను రప్పించి ప్రచారం నిర్వహించాయి. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణకు మద్దతుగా అగ్రనేత రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు సీతక్క, ఇతర నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు. బీజేపీ తరపున కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా, పార్టీ ఎమ్మెల్యేలు ప్రచారం చేపట్టారు.



బాలాపూర్‌లో వృద్ధులను ఓటు అభ్యర్థిస్తున్న జోగు రామన్న

బీఆర్ఎస్ ప్రచారానికి స్పందన

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా.. వీటిలో బీఆర్ఎస్ నాయకులు చేసిన ప్రచారానికి మంచి స్పందన కనిపించింది. గ్రామాలు, పట్టణాల్లో కమిటీలను ఏర్పాటు చేసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పందేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుల గురించి పట్టించుకోకపోవడం, ఐదు నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. ప్రచార రథాలు గ్రామాల్లో తిరుగుతూ పాటల ద్వారా ఓటర్లను ఆకర్షించాయి. పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీల ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. ఢిల్లీలో తెలంగాణ గొంతు వినిపించాలంటే బీఆర్ఎస్ గెలువాల్సిన అవసరం ఉందని తెలిపారు. పార్లమెంట్ పరిధిలో గ్రామాలు, పట్టణాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పకడ్బందీ ప్రణాళికలతో ముందుకు సాగారు.

ముథోల్ : ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తలమడగు మండలం సుంకిడిలో రోడ్డు పక్కన హోటల్‌లో బజ్జీలు తింటున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్